

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 204 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం, 24, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






# పొట్టకూటి కోసం.. పుట్టెడుతిప్పలు!

డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



## అన్నం లేక అల్లాడిపోతున్న పేదలు



- కష్టపడితే గాని పూట గడవని రోజులు
- పని దొరకక పస్తులు ఉంటున్న కుటుంబాలు
- గాసాలు ఎల్లక గాబర పడుతున్నారు
- పేదలను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు చేస్తున్నది ఏమిటి
- ప్రభుత్వాలతో ప్రజలకు మేలు జరగడం సాధ్యమయ్యేనా
- ఉన్నపాటుగా ప్రజలందరూ పేదరికంలోనికి నెట్టివేయబడుతున్నారు
- దేశ సంపద ఎటు పోతుంది ప్రజలందరూ ఏమవుతున్నారు
- పేద ప్రజలపై పగబడుతున్న ప్రభుత్వాలను ఏం చేయాలి
- ప్రజల వైపు నిజాయితీగా నిలబడుతున్నది ఎవరు
- పేదరిక నిర్మూలన పేరుకేనా
- ప్రజాధనాన్ని రాబందుల్లా దోచుకుంటున్నారు
- డాక్టర్ బరిగెల శివ


**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

పేద ప్రజల ఆకలి తీర్చడం కోసం ప్రభుత్వాలు పోటీ పడాల్సిన అవసరం ఉందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.ప్రజలను కష్టాలలో నుండి వెలికి తీయాల్సిన బాధ్యత ముమ్మాటికి ప్రభుత్వాలదేనని గుర్తు చేశారు.దేశంలో దినదినానికి పేదరికం పెరిగిపోవడమే కాకుండా ఆకలి చావులు పెరిగిపోతుండడం బాధాకరంగా ఉందన్నారు.తినడానికి తిండి లేకుండా ఆకలికి ఓర్చుకోలేకుండా చనిపోతున్న ప్రజల సంఖ్య పెరిగిపోతుందన్నారు. దేశం ఆర్థికంగా వెనకబడిపోతుందా అభివృద్ధి చెందుతుందా అనేది మేధావులకే తెలియాలి కానీ పేద ప్రజల చావులకు కారణాలు ఎవరు అనేది మాత్రం బహిర్గతం చేయడానికి ప్రభుత్వాలే కాదు మేధావులు కూడా భయపడుతున్నారని గుర్తు చేశారు.సమాజంలో డబ్బు లేని వాడు ఎంతటి పేదవాడైనా ఎంతటి గొప్పవాడైన ఎంతటి నిజాయితీపరుడైన ఎంతటి ఉన్నతమైన భావాలు కలిగిన వాళ్లయినా వాళ్ల జీవితాలు బూడిదలో పోసుకున్న పన్నీరు లాంటివేనని అదేవిధంగా డబ్బు కలిగిన వాడు పచ్చి మోసగాడైనా ప్రభుత్వ ఆస్తుల దోపిడిదారుడైనా అక్రమంగా అన్యాయంగా - మిగతా 2లో..

## ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

- 80కి పైగా అంశాలకు గ్రీన్ సిగ్నల్
- వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులకు పెద్దపీట
- పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం
- రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన
- ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- జ్యుడిషియల్ అకాడమి నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం
- అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు

2




## బాసర సరస్వతీ ఆలయంలో చోరీ

- కాళీమాత ఆలయంలో ?
- వెండి కిరీటం చోరీ
- సిసి కెమెరాలపై బట్టలు కప్పి చీరికి
- పాల్పడ్డట్లు గుర్తింపు
- సమాచారం అందుకుని
- పరిశీలించిన ఎస్పీ

2



## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

### గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ,జూన్23(జై భీమ్ క్రైమ్ న్యూస్):**



కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



## రేవంత్ కోరారు..కేంద్రమంత్రులను కలిసాం

### ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్23(జై భీమ్ క్రైమ్ న్యూస్):**

ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళశారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# బాసర సరస్వతీ ఆలయంలో చోరీ

**కాళీమాత ఆలయంలో వెండి కిరీటం చోరీ**
**సిసి కెమెరాలపై బట్టలు కప్పి చీరికి పాల్పడ్డట్లు గుర్తింపు**
**సమాచారం అందుకుని పరిశీలించిన ఎస్పీ**



**నిర్మల్,జూన్23(జై భీమ్ క్రైమ్ న్యూస్):**

బాసరలో కొలువుదీరిన జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో భారీ చోరీ జరిగింది. మొదటి అంతస్తులోని మహంకాళి అమ్మవారి ఆలయంలో తలుపు తాళాలు దొంగలు పగలకొట్టి అమ్మవారి వెండి కిరీటంతోపాటు హుండీని దొంగిలించారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం చేసేందుకు దేవాలయంలోకి పురోహితులు వెళ్లారు. అమ్మవారి ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని వారు గుర్తించారు అనంతరం దేవస్థానం అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సరస్వతి అమ్మవారి ఆలయంలోని పై అంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి మరీ ఈ దోపిడీకి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గుడికి వచ్చిన సందర్భంగా తాళాలు పగులగొట్టి ఉండటం గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. ఆలయ భద్రతా సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ పూజారి చేత తలుపులు తెరిపించారు. ఆ సమయంలో అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు పోలీసులు గుర్తించారు.కాగా, సీసీ కెమెరాలపై వస్త్రాలు కప్పి దొంగలు ఆలయంలోకి ప్రవేశించినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. చోరీకి పాల్పడిన హుండీలో నుంచి డబ్బులు తీసుకుని, తర్వాత హుండీని వ్యాసగుడి సమీపంలో పడేసినట్లుగా పోలీసులు గుర్తించారు. బాసర ఆలయంలో చోరీ గురించి సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఘటనాస్థలిని పరిశీలించారు. చోరీ జరిగిన తీరు, సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమావేశమయ్యారు. కేసును అన్ని కోణాల్లో విచారించి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

**కేంద్రమంత్రులతో సిఎం రేవంత్ చర్చలు ఫలప్రదం**
**ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డితో కలసి భేటీ**
**మెట్రో రైలుపై చర్చల్లో కీలక పురోగతి**

**న్యూఢిల్లీ,జూన్23(జై భీమ్ క్రైమ్ న్యూస్):**

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్–1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్–2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర–రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్‌స్టలెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్–1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్–2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్‌స్టలెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేందప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల పక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. అలాగే, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద జోషిని ఇరువురు మంత్రులు కలవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరనున్నారు. అనంతరం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సమావేశమై.. యూరియా సరఫరా పెంచాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేయనున్నారు.

# పొట్టకూటి కోసం పుట్టెడుతిప్పలు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వాలను ప్రజలను ప్రభుత్వ కార్యాలయాలను మోసగించి సంపాదించుకున్న వ్యక్తి ఎవరైనా సమాజంలో గౌరవ మర్యాదలు పొందుకుంటున్నారని తెలిపారు.సమాజంలో డబ్బును బట్టి మాత్రమే మనిషికి విలువ ఉంటుంది తప్ప నిజాయితీని బట్టి విలువలు దొరకడం లేదన్నారు.పొట్టకూటి కోసం పుట్టెడు బాధలు పడుతున్న ప్రజలెక్కడ అవకాశం దొరికితే లెక్కలేనంత ఆస్తులు సంపాదించుకునే సంపన్నులు ఎక్కడ అంటూ సమాజంలో పేద ప్రజలు లెక్కలేసుకుంటున్నారని గుర్తు చేశారు.దేశంలో రాజకీయాలు బలపడుతున్నాయి గానీ ప్రజలు డీలపడుతున్నారని ప్రజలు అణిచివేయబడుతున్నారని ప్రజలు ఆకలి కేకలతో బాధపడుతున్నారని గుర్తు చేశారు.దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో పేదరికం పెరిగిపోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వాలకు పేద ప్రజలపై మక్కువ తగ్గిపోవడమేనని ప్రజాసేవపై దృష్టి సారించలేకపోతున్నారని వివరించారు. ప్రజల మేలు కోరుకునే రాజకీయ విలువలు పూర్తిగా తగ్గిపోవుతుండడంతో ప్రజల బతుకులు ఆగమవుతున్నాయని గుర్తు చేశారు. ఏ పేద వ్యక్తైన సిరిసంపదల కోసం ఆశపడడం లేదు గాని పూట గడవడం పైనే ఆధారపడుతున్నారన్న సంగతిని ప్రభుత్వాలు ఏమాత్రం పసిగట్టడం లేదన్నారన్నారు.ప్రతి రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు తగ్గిపోతున్నాయని పేరుకు మాత్రమే ప్రజాసేవ అంటూ పరితపిస్తున్న ప్రజాప్రతినిధులు అంతా కలిసి ప్రభుత్వ పరిధిలో పేదలకు చేస్తున్న సేవలను మాత్రం తగ్గించుకుంటూ పోతున్నారన్నది జగమెరిగిన సత్యమన్నారు.

**ప్రభుత్వాలతో పేదరిక నిర్మూలన సాధ్యమేనా..**

ఏ రాష్ట్రంలో చూసిన పేదల సంక్షేమం కొరకు ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్న సొమ్ము ఆధారాలను మించి లెక్కలు చూపిస్తున్న ప్రభుత్వాలు అభివృద్ధిలో మాత్రం ప్రజాజీవన విధానాలను మెరుగుపరచకపోవడం తీవ్రమైన అనుమానాలకు దారితీస్తుందని పేద ప్రజలు గగ్గోలు పెడుతుండగా పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు ప్రభుత్వాలు తీసుకుంటున్న సంక్షేమ పథకాలు ప్రభుత్వాలు పేద ప్రజలకు చేస్తున్న అద్భుతమైన మేలులు ఏమిటో బహిరంగంగా తెలపడానికి మాత్రం భయపడుతున్నారని అన్నారు.పేద ప్రజలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే మాత్రమే పేదరిక నిర్మూలన అనేది జరిగినట్లుగా భావించాల్సి వస్తుందని అలాకాకుండా పేదలు నిరుపేదలు అయిపోతూ ధనికులు సంపన్నులు అవుతున్నారని అలాంటి సందర్భాల్లో పేదరిక నిర్మూలన ఎలా సాధ్యమవుతుందంటూ సూటిగా నిలదీశారు.కేంద్ర ప్రభుత్వం అధికారికంగా కాకుండా అనధికారికంగా లక్షల కోట్ల రూపాయల పన్నులను వసూలు చేస్తున్నట్లుగా సోషల్ మీడియా కోడై కూస్తున్నపుడు దేశ అభివృద్ధి మరుగున పడడానికి కారణమేంటంటూ నిలదీశారు.ఒకవైపు దేశంలో పెరిగిపోతున్న అప్పులను నియంత్రించడం కేంద్ర ప్రభుత్వం వల్ల కాదని తెలిసినప్పటికిని దేశం అభివృద్ధి కొరకు అప్పులు చేయాల్సి వస్తుందంటూ దేశ ప్రజలను నమ్మించే పనిలో కేంద్ర ప్రభుత్వం నిమగ్నం అవ్వడమే జరుగుతుంది తప్ప ఏ రాష్ట్రంలో చూసిన అభివృద్ధి క్షేత్రస్థాయిలో నిరాశ పరుస్తుందన్నది పూర్తిస్థాయిలో వాస్తవమన్నారు.చాలా రాష్ట్రాల్లో వృద్ధులకు పెన్షన్ దారులకు వికలాంగులకు,మహిళలకు, వితంతువులకు రావాల్సిన పెన్షన్స్ తోపాటు ప్రభుత్వ సంక్షేమాలను నియంత్రిస్తున్నారని వాటి వల్ల పేదరికం పెద్ద ఎత్తున పెరగిపోడానికి ప్రభుత్వాలే బలమైన కారణాలు అవుతున్నాయని హెచ్చరించారు.పరిపాలనలో చరిత్రకారులమని గర్వంగా చెప్పుకునే నాయకులంతా దేశం కోసం దేశ ప్రజల కోసం చేసిన అభివృద్ధిని చెప్పమంటే చాటుమాటున తిరుగుతున్నారని ఎద్దేవ చేశారు.రాజకీయాల ప్రభావం రాజకీయ నాయకులకు అనుగుణంగా మలుచుకుంటూ అభివృద్ధి చెందిన సంపన్నులంతా ఒకవైపు ఉంటూ దేశాన్ని దేశ సంపదను దేశ వనరులను దోచుకోవడమే కాకుండా ఎక్కడికక్కడ పోగు చేసుకునే క్రమంలో బలవంతులుగా ఎదుగుతున్నారని ఎక్కడ చూసినా పేదవాడు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటూ ఆర్థికంగా ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకోలేని పరిస్థితిలో ప్రాణాలు కోల్పోతున్నారని అంతటి దీనమైన పరిస్థితిలను ఒకవైపు పేదవాళ్ళు ఎదుర్కొంటుండగా రాజకీయ అవకాశవాదులు ఉద్యోగ అవకాశవాదులు వ్యాపార అవకాశం వాదులు రహస్య వ్యాపారాలను చేతుల్లోనికి తీసుకుంటూ అభివృద్ధి చెందుతున్న సంపన్నులందరూ పేదలకు ఏమాత్రం సహకారంగా నిలువలేక పోతున్నారని గుర్తు చేశారు.ఒక్కొక్క ప్రభుత్వ అధికారి ఒక్కొక్క ప్రజా ప్రతినిధి ఒక్కొక్క రాజకీయ నాయకుడు వేలకోట్ల ఆస్తులు పోగు చేసుకోవడం ఏందంటూ పేద ప్రజలు పెద్ద ఎత్తున విమర్శిస్తుండగా పేద ప్రజలు అంటేనే ఆమడ దూరాన పెట్టే దురహంకారం కలిగిన పైస సంపన్నులు పేదలను అన్నానికి నోచుకోకుండా చేస్తున్నారనేది వాస్తవం అన్నారు.అడపాదడపా రాజకీయ నాయకులు తప్ప అడపాదడపా ప్రభుత్వాధికారులు తప్ప పేద ప్రజల వైపు నిలబడడానికి పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించడానికి సంపన్నులకు ధనవంతులకు వ్యాపారస్తులకు ఏమాత్రం మన సొప్పకపోవడం మహా మోసం అన్నారు.రాజకీయ నాయకుల అభివృద్ధికి పునాదులు వేసినది ముమ్మాటికి పేద ప్రజల ఓట్లేనని ఏ రాష్ట్రంలో చూసిన అధికార అభివృద్ధి రాజకీయ అభివృద్ధి పేద ప్రజల ఓట్లతో మాత్రమే సాధ్యమవుతుందనేది గర్వంగా చెప్పగల నిజమని తెలిసినప్పటికిని రాజకీయ ఎన్నికల పరిధి వరకే పేద ప్రజలను అవకాశవాదులుగా వాడుకుంటూ ఎన్నికల అనంతరం పేద ప్రజలను చిదరించుకుంటూ చివాట్లు పెడుతూ దగ్గరకు రానివ్వకుండా పేద ప్రజల సంక్షేమాన్ని పేద ప్రజల అభివృద్ధిని పేదరిక నిర్మూలనను ఆమడ దూరాన పెడుతూ రాజకీయ అభివృద్ధి వ్యాపారాల అభివృద్ధికి బానిసలు అవుతున్న రాజకీయ నాయకులు లెక్కలేనంతగా పెరిగిపోతున్నారని వాళ్లంతా అహంకారాన్ని నెత్తిన ఎక్కించుకొని పేద ప్రజలను మరింత పేదరికంలోనికి నెట్టివేస్తున్నారని ఇలాంటి నీచమైన రాజకీయాలకు పాల్పడుతున్న రాజకీయ నాయకులంతా లెక్కలేనని సందర్భాల్లో పేదరిక నిర్మూలన కోసం పాటుపడుతున్నామంటూ శబ్ద ధ్వనులతో ప్రతిధ్వనులు వచ్చేంతగా అరుస్తున్నారని విమర్శించారు.పేదరిక నిర్మూలన ఏమో గాని పేద ప్రజలకు కావలసిన నిత్యవసరాలు ఆహార పదార్థాలు కుటుంబం గడవడానికి సాధారణమైన కూలి పనులు దొరికితే సరిపోతుందని ఆశపడే కుటుంబాలు 100 కోట్లకు పైన ఉన్నాయన్నది మాత్రం పచ్చి నిజమన్నారు.

**పేదలను ఆదుకుంటున్నది ఎవరు..**

పేదలను ఎప్పటికప్పుడు ఆదుకోవడానికి ముందుకు వస్తూ పేద ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటున్నది మాత్రం స్వచ్ఛంద సంస్థలేనని బలంగా విశ్వసిస్తూ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.పేద ప్రజలు పేద ప్రజల పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని నిరుద్యోగానికి దగ్గరవుతున్నారని అలాంటి వాళ్లకు అండగా నిలుస్తున్నది అనాథ ఆశ్రమాలు స్వచ్ఛంద సంస్థలేనని అభినందించారు.పేదలకు సేవ చేయాల్సిన రాజకీయ నాయకులు దారి తప్పుతున్నారని పేదలను ఎప్పటికప్పుడు ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నాయని పేదల పక్షాన నిలబడుతూ ప్రభుత్వాల ద్వారా పేదల సంక్షేమానికి పాటుపడాల్సిన ప్రభుత్వ అధికారులు అవినీతి అక్రమాలకు బానిసలు అవుతున్నారని ఇలాంటి సందర్భాల్లో కేవలం పేదలను ఆదుకోవడానికి ఎవరు ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు.పేదల హక్కుల కోసం పోరాడుతున్న ప్రజా సంఘాలు కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు మహిళా సంఘాలు నిరుద్యోగ సంఘాలు ప్రభుత్వాలకు ద్రోహుల్లాగా కనిపిస్తున్నారని హెచ్చరించారు.దేశంలో ఒకవైపు కార్మిక చట్టాలు కార్మికుల జీవితాలను హరించి వేస్తుండగా దేశంలో పేద ప్రజలను బానిసత్వ జీవితాలకు అలవాటుపడేలా చేస్తున్న ప్రభుత్వాలు మొండి వైఖరి పూర్తిగా నశించాలని హెచ్చరించారు.సమాజంలో ప్రభుత్వాల పరువు రాజకీయ నాయకుల పరువు ప్రజాప్రతినిధుల పరువు ఏమైపోతుందోనని ఏమాత్రం ఆలోచన లేకుండా ప్రజలను మోసగించి పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ మనం ఒక్కరం బాగుంటే సరిపోతుందని దుర్మార్గపు ఆలోచనల్లో రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వాలు ఉంటుండడం పేదరికం పూర్తిస్థాయిలో పేదరికంలోనికి నెట్టి వేయడానికి ఆత్రుత పడుతున్నట్లుగా ఉందన్నారు.రాజకీయ ఎన్నికల అప్పుడు మాత్రమే ప్రజలతో అవసరం ఉంటుంది తప్ప మిగతా సందర్భాల్లో కనీసం పేద ప్రజలతో కలిసి వాళ్ళ బాగోగులు వాళ్ళ కష్టసుఖాలు తెలుసుకుందామన్న ఆలోచన ఏ ఒక్కరికి లేకుండా పోతుండడం పేదరికంపై పగబట్టడమేనన్నారు.దేశవ్యాప్తంగా మరో రకమైన పెనుబారమైన పేదరికం నిరుద్యోగ యువతను వెంటాడుతుందని ఉన్నతమైన చదువులు చదువుకొని ఉద్యోగాలు దొరకక మానసిక వేదనతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న యువత పెరిగిపోతున్నారని నిరుపేద యువతను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు రాజకీయ నాయకుల మీటింగ్లకు సమావేశాలకు జనాలను పోగు చేసే బానిసలుగా వాడుకుంటున్నారని మొత్తం మీదుగా రాజకీయ నాయకుల ఆడంబరాలు ప్రభుత్వ ఉద్యోగుల ఆగడాలు సంపన్నులకు మేలు కరంగా ఉంటున్నాయి తప్ప పేద ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా ఉండటంలేవన్నది పచ్చి నిజమన్నారు.



# ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

**80కి పైగా అంశాలకు గ్రీన్ సిగ్నల్**
**వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులకు పెద్దపీట**
**పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం**
**రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన**
**ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన**
**జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం**
**అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు**




**అమరావతి,జూన్23(జై భీమ్ క్రైమ్ న్యూస్):**

ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపులు, బయోగ్యాస్ ఎ÷–లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, మెమో–57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థుల్లో చైతన్యం







### యాంటీ డ్రగ్ సోల్జర్ క్యాంపెయిన్ నిర్వహించిన కేయూసీ పోలీసులు

**కేయూ, 23 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**


మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుండాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని కేయూసీ పోలీసులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు చింతగట్టు ప్రాంతంలోని ఆల్ఫోర్స్ కళాశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు, చిత్రలేఖన పోటీలు, సిగ్నేచర్ క్యాంపెయిన్, యాంటీ డ్రగ్ సోల్జర్ సెల్ఫీ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కేయూసీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన సమస్యలు, కుటుంబ వ్యవస్థపై పడే ప్రభావం, సమాజంలో పెరుగుతున్న నేరాలకు డ్రగ్స్ ఎలా కారణమవుతున్నాయనే అంశాలపై అవగాహన కల్పించారు. ఏసీపీ నరసింహారావు మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా డ్రగ్స్ విక్రయాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ యువత తమ జీవిత లక్ష్యాలను చేరుకోవడానికి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ అనేది వ్యక్తిని మాత్రమే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని కూడా దెబ్బతీసే ప్రమాదకరమైన వ్యసనమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్‌గా మారి మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో విద్యార్థులు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను తమ చిత్రాల ద్వారా ఆకట్టుకునే విధంగా ప్రతిబింబించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసులు కలిసి డ్రగ్స్ వ్యతిరేక సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు. అలాగే "యాంటీ డ్రగ్ సోల్జర్" సెల్ఫీ క్యాంపెయిన్ నిర్వహించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించగా, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఇతరులను కూడా చైతన్యవంతులను చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు.

# "మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవు"

### వాహన యజమానులు, తల్లిదండ్రులకు పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరిక

**వరంగల్, 23 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి చేత డ్రైవింగ్ చేయించడం ద్వారా చట్టపరమైన ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉందని, మైనర్ల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమానులు, తల్లిదండ్రులే బాధ్యులవుతారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ, కొంతమంది వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని కమిషనర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ రోడ్డు భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదాన్ని ప్రస్తావిస్తూ కమిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్ బాలుడు అతివేగంగా వాహనం నడుపుతూ ఇద్దరు వృద్ధులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే ఇద్దరు వృద్ధులతో పాటు మైనర్ బాలుడు మృతి చెందగా, మరో మైనర్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఎలాంటి తప్పు చేయని ఇద్దరు వృద్ధులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటన ప్రతి కుటుంబానికి ఒక హెచ్చరికగా భావించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతున్నామని కమిషనర్ అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు అందజేయడం చట్టరీత్యా నేరమని, మైనర్ డ్రైవింగ్ కారణంగా ప్రమాదం జరిగితే వాహన యజమాని లేదా తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇకనైనా వాహన యజమానులు తమ పిల్లలకు, మైనర్ డ్రైవర్లకు వాహనాలు అందజేయకుండా అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు.




# కొత్తపల్లిలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన





### డీసీసీ బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: డీసీసీ బ్యాంకు మేనేజర్ ఉమేశ్ రెడ్డి

**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

గ్రామీణ ప్రజల్లో బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంపొందించేందుకు వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మడికొండ బ్రాంచ్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ సేవల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాబార్డ్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పీఏసీఎస్ ఖాజీపేట అధ్యక్షుడు ఉకంటి వనం రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంకు మేనేజర్ ఉమేశ్ రెడ్డి, సూపర్వైజర్ రమేశ్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు అందుబాటులో ఉన్న వివిధ డిపాజిట్ పథకాలు, రుణ సదుపాయాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవల గురించి వివరించారు. ముఖ్యంగా బ్యాంకు ప్రవేశపెట్టిన "రాణి రుద్రమ డిపాజిట్ స్కీమ్" కింద 444 రోజుల కాలపరిమితికి 8.10 శాతం వరకు అధిక వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, పాడి పరిశ్రమ అభివృద్ధికి దీర్ఘకాలిక రుణాలు, బర్రెలు, గొర్రెల కొనుగోలు రుణాలు, ట్రాక్టర్లు, హార్వెస్టర్ల కొనుగోలు కోసం రుణాలు, గృహ నిర్మాణ రుణాలు, విద్యా రుణాలు, ఫోర్ వీలర్ రుణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ఆన్‌లైన్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, లాకర్ సదుపాయాలను ఖాతాదారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పించారు. బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డులు ఎవరికీ చెప్పవద్దని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలకు స్పందించవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాజాత కళాకారుడు ఉదయ్ కృష్ణ, ఆయన బృందం నాటకాలు, పాటల ద్వారా బ్యాంకింగ్ సేవలు, డిపాజిట్ పథకాలు, బీమా పథకాలు, రుణ సదుపాయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే మ్యాజిక్ షో ద్వారా బ్యాంకింగ్ సేవల ప్రాముఖ్యతను వినూత్నంగా వివరించి ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఖాజీపేట సిబ్బంది జ్ఞానేశ్వర్, రాజు, వినోద్, లింగారెడ్డి, వెంకటరమణతో పాటు గ్రామ ప్రజలు, రైతులు, ఖాతాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దోమలో మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా పై అవగాహన ర్యాలీ




**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా గురించి ఈనెలలో జూన్ 26 న జరుపుకునే ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్ డే పురస్కరించుకుని, దోమ పాఠశాలలోని విద్యార్థులకు గ్రామస్తులకు యువతకు అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమ ఎస్ఐ వసంత్ జాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు కానీ యువత కానీ మత్తుకు బానిసలు కాకూడదని డ్రగ్స్ గంజాయి, గుట్కా వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు. ఎవరైనా వీటిని అమ్మిన కానీ వాడిన కానీ టోల్ ఫ్రీ నెంబర్ 1908, కు 8712671111 వాట్సాప్ నెంబర్ కు గాని సమాచారం అందించగలరని ఆ సమాచారం గోప్యంగా ఉంచుతారని అవసరమైన వారికి ఉచితంగా కౌన్సెలింగ్ ఇచ్చి, ట్రీట్మెంట్ చేస్తారని తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. అక్రమ మారక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని సమాజంలో విలువ ఉండదు ఉండదు. దేశానికి చీరపురుగులుగా తయారవుతారు. కావున ఎవరు కూడా డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని డ్రగ్స్ రహిత తెలంగాణ మనందరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కొనసాగుతున్న వరంగల్ పోలీస్ డ్యూటీ మీట్

### నైపుణ్యాలను ప్రదర్శిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది




**వరంగల్, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సోమవారం ప్రారంభమైన పోలీస్ డ్యూటీ మీట్ రెండవ రోజు కూడా ఉత్సాహభరితంగా కొనసాగింది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ డ్యూటీ మీట్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాలను ప్రదర్శిస్తూ వివిధ విభాగాల్లో పోటీల్లో పాల్గొంటున్నారు. పోలీస్ శాఖలో విధుల నిర్వహణలో నాణ్యతను పెంపొందించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచడం, నేరాల దర్యాప్తులో సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ డ్యూటీ మీట్‌ను నిర్వహిస్తున్నారు. సోమవారం అదనపు డీసీపీ బాలస్వామి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డ్యూటీ మీట్‌లో భాగంగా కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో అధికారులు, సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. నేరాల పరిశోధన, ఆధారాల సేకరణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అత్యవసర పరిస్థితుల నిర్వహణ వంటి అంశాల్లో వారి ప్రతిభను పరీక్షించే విధంగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలు మరింత మెరుగుపడటంతో పాటు, పరస్పర అనుభవాలను పంచుకునే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యే ఉత్తమ ప్రతిభావంతులను గుర్తించేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. పోలీస్ శాఖలో సాంకేతికత, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతుల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే డ్యూటీ మీట్ ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.

## వరంగల్ ప్రెస్ క్లబ్ వ్యవహారాల్లో స్టేటస్ కో కొనసాగించాలని కోర్టు ఆదేశం

**హన్మకొండ, 20 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**


STATUS QUO ORDER
(Under Order 39 Rule 1 & 2 C.P.C)
IN THE COURT OF PRINCIPAL DISTRICT JUDGE AT HANUMAKONDA
Saturday, the 20th day of June, 2026
Present: Smt. M.R. Sunitha, Principal District Judge, Hanumakonda
I.A.NO. 830 OF 2026 IN SOP NO. 3 OF 2026
Between:-
Bantu Rajlenin S/o. Br. Bhagavan Das, aged about 57 years, Occupation: Journalist in TVS, R/o. H.No. 4-6-157, Kumarpally, Hanumakonda
...Petitioner/Applicant
AND
1. Warangal Press Club, Regd.No. 1188/1991, H.No. 7-1-99/C, Opp. Hanumakonda Fire station, Balasamudram, Hanumakonda District, Represented by its President Nagaraju Vemula.
2. Warangal Press Club, Regd. H.No.7-1-99/C, Opp. Hanumakonda Fire station, Balasamudram, Hanumakonda District, Represented by its General Secretary Boliarapu Sadaiah, Occupation:Journalist, R/o. Balasamudram, Hanumakonda.
...Respondents
Upon motion made on to this Court by Sri Y. Sundar Ram, Advocate for the petitioner/Applicant, upon hearing the arguments of the said Counsel and perusal of documents filed by Petitioner/Applicant herein, this Court doth order that there is prima facie case, hence both parties are directed to maintain status quo with regard to the administration and affairs of the 1st respondent Press Club as on today until the next date of hearing.
Next date of hearing: 08.07.2026
(Given under my hand and seal of this Court, on this the 20th day of Saturday,
PRINCIPAL DISTRICT JUDGE, HANUMAKONDA

వరంగల్ ప్రెస్ క్లబ్ పరిపాలన, నిర్వహణ మరియు అన్ని వ్యవహారాల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని యథాతథంగా కొనసాగించాలని హనుమకొండ ప్రధాన జిల్లా న్యాయమూర్తి కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రెస్ క్లబ్ కార్యకలాపాల్లో ఎలాంటి మార్పులు చేయరాదని కోర్టు స్పష్టం చేసింది. టీవీ5 జర్నలిస్ట్ బంటు రాజ్ లెనిన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన జిల్లా న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత విచారణ చేపట్టారు. ఈ పిటిషన్‌లో వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు వేముల, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్యలను ప్రతివాదులుగా చేర్చారు. పిటిషనర్ తరపున న్యాయవాది వై. సుందర్ రామ్ వాదనలు వినిపించగా, సమర్పించిన పత్రాలు, రికార్డులను కోర్టు పరిశీలించింది. కేసులో ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు గుర్తించిన కోర్టు, తదుపరి విచారణ పూర్తయ్యే వరకు ప్రెస్ క్లబ్ పరిపాలనలో ఎలాంటి మార్పులు చేయకుండా ప్రస్తుతం ఉన్న పరిస్థితినే కొనసాగించాలని ఇరు పక్షాలను ఆదేశించింది. అలాగే ఈ కేసు తదుపరి విచారణను జూలై 8, 2026కు వాయిదా వేసింది. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో వరంగల్ ప్రెస్ క్లబ్ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలు, పాలనా నిర్ణయాలు తదితర అంశాల్లో ప్రస్తుతం అమలులో ఉన్న పరిస్థితినే కొనసాగించాల్సి ఉంటుంది. కోర్టు తుది తీర్పు వెలువడే వరకు వరంగల్ ప్రెస్ క్లబ్ వ్యవహారాలు 'స్టేటస్ కో' పరిధిలోనే కొనసాగనున్నాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# డిగ్రీ సీటు కన్ఫర్మేషన్‌కు సీసీ ఓటీపీ తప్పనిసరి

## దోస్త్ విద్యార్థులకు పింగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూచన

**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



దోస్త్-2026 అడ్మిషన్ల ద్వారా డిగ్రీ కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలలో తమ ప్రవేశాన్ని ఖరారు చేసుకోవడానికి సీసీ ఓటీపీ (కాలేజీ కన్ఫర్మేషన్ ఓటీపీ ) తప్పనిసరిగా సమర్పించాలని హనుమకొండ వడ్డేపల్లిలోని పింగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ దోస్త్-2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి, రెండో విడత అడ్మిషన్లు పూర్తయ్యాయని, మూడో విడత అడ్మిషన్లు కూడా ముగిశాయని తెలిపారు. మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులకు ఈ నెల 25వ తేదీ వరకు వారి మొబైల్ ఫోన్లకు సీటు కేటాయింపు సమాచారం పంపబడుతుందని పేర్కొన్నారు. మూడో విడతలో సీటు పొందిన విద్యార్థులు జూన్ 26 నుంచి జూలై 2వ తేదీ వరకు తమ సీటును అంగీకరించి అలాట్‌మెంట్ ఆర్డర్ కాపీని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అలాగే మొదటి, రెండో, మూడో విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 27 నుంచి జూలై 4వ తేదీ మధ్య కళాశాలకు హాజరై ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), అవసరమైన జిరాక్స్ పత్రాలు సమర్పించడంతో పాటు తమ మొబైల్‌కు వచ్చిన సీసీ ఓటీపీని అడ్మిషన్ విభాగంలో నమోదు చేయాలని తెలిపారు. విద్యార్థులు సీసీ ఓటీపీని కళాశాలలో నమోదు చేయకపోతే వారికి కేటాయించిన సీటు రద్దయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల దోస్త్ రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన మొబైల్ ఫోన్‌ను కళాశాలకు తీసుకురావాలని సూచించారు. పింగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ (ఇంగ్లీష్ మీడియం), బీకాం (కంప్యూటర్స్), బీకాం (బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్), బీబీఏ రిటైల్ ఆపరేషన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ హెల్త్ కేర్, బీఎస్సీ డెయిరీ అండ్ పౌల్ట్రీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులు నిర్ణీత గడువులోపు కళాశాలకు వచ్చి కాలేజ్ కన్ఫర్మేషన్ పూర్తి చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి కోరారు.

# నగర పార్కుల అభివృద్ధికి ఆధునిక నమూనాలు రూపొందించాలి

## డబ్ల్యూఆర్ఐ సాంకేతిక సహకారంతో పార్కులను అభివృద్ధి చేయాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

నగరంలోని పార్కులను ప్రజలకు మరింత ఆకర్షణీయంగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక నమూనాలు రూపొందించి అభివృద్ధి పనులు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (డబ్ల్యూఆర్ఐ) ప్రతినిధులు, జీడబ్ల్యూఎంసీ అధికారులతో నగర పార్కుల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్కుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వినోద, విశ్రాంతి సౌకర్యాల కల్పనపై పలు సూచనలు చేశారు. బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కును డబ్ల్యూఆర్ఐ రూపొందించిన ఆధునిక డిజైన్ల ఆధారంగా అభివృద్ధి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అదే విధంగా నగరంలోని ఇతర పార్కుల అభివృద్ధికి కూడా డబ్ల్యూఆర్ఐ సాంకేతిక సహకారం అందించాలని కోరారు. ప్రజల అవసరాలు, పిల్లల వినోదం, పర్యావరణ పరిరక్షణ అంశాలను దృష్టిలో ఉంచుకుని పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు. వరంగల్ పరిధిలోని కీర్తినగర్ పార్కుతో పాటు నగరంలోని మరికొన్ని పార్కులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించే దిశగా పార్కుల అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో పార్కులు ముఖ్యపాత్ర పోషిస్తాయని, ఆధునిక సదుపాయాలతో కూడిన పార్కులు నగర సౌందర్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డబ్ల్యూఆర్ఐ కన్సల్టెంట్ ప్రతినిధి ఎలైన్ అగీత్, జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్‌బాబు, డిప్యూటీ ఇంజనీర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీకేఎం కళాశాలలో తవ్వినకొద్దీ కాసుల లీలలే..!?

**కళాశాలలో అవినీతి రాజ్యమేలుతోంది**
**గత 15 సంవత్సరాల నుండి ఉన్న లెక్కల పుస్తకాలను మాయం చేస్తున్నది ఎవరు ?**
**కళాశాలలో అవినీతిని పెంచి పోషిస్తున్నది ఎవరు ?**
**వారిని కాపాడుతున్నది ఎవరు?**
**ధర్మన్న ఆశీస్సులతో "రియల్" రాజ్యమేలుతున్న శ్రీనివాసుడు**
**ప్రిన్సిపాల్ మౌనం వెనుక మర్మమేంటి..?**
**ఉద్యోగా నియామకాలపై భారీ అనుమానాలే...**

సమాధానాలు కోరుతున్న విద్యార్థి సంఘాలు

**వరంగల్, 23 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**




వరంగల్ నగరంలోని సీకేఎం డిగ్రీ, పీజీ కళాశాల చుట్టూ గత కొంతకాలంగా వినిపిస్తున్న ఆరోపణలు, అనుమానాలు, వివాదాలు రోజురోజుకూ తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. వరుసగా మీడియా కథనాలు వెలువడుతున్నప్పటికీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మరెడ్డి ఇప్పటివరకూ స్పందించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. దీంతో సీకేఎం కళాశాలల తవ్వినకొద్దీ ఒక్కొక్కటిగా ధర్మన్న ఆశీస్సులతో " రియల్ " రాజ్యమేలుతున్న శ్రీనివాసుడి కాసుల లీలలు వెలుగుచుస్తున్నాయనేది గమనార్హం. కళాశాలలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ కళాశాల సమయాల్లోనే రియల్ ఎస్టేట్ వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా పరిపాలనా వ్యవహారాల్లోనూ పలు అక్రమాలు జరిగాయనే ప్రచారం సాగుతోంది. ఈ ఆరోపణలు వాస్తవమా..? లేక అసత్యమా..? అనే విషయంపై కళాశాల యాజమాన్యం ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. "ఆరోపణలు నిరాధారమైతే అధికారికంగా ఖండించాలి. వాస్తవాలుంటే చర్యలు తీసుకోవాలి. కానీ మౌనం ఎందుకు..?" అని విద్యార్థి సంఘాల నాయకులు నిలదీస్తున్నారు.

### ఉద్యోగాల నియామకాలపై భారీ అనుమానాలు

కళాశాలలో జరిగిన శాశ్వత ఉద్యోగాల నియామక ప్రక్రియపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నియామకాల కోసం కోట్ల రూపాయలు చేతులు మారాయనే ప్రచారం ఎందుకు జరుగుతోంది? దాదాపు రూ.2.80 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయనే ఆరోపణలపై యాజమాన్యం స్పందించకపోవడానికి కారణమేంటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### విద్యార్థి సంఘాలు లేవనెత్తుతున్న ప్రశ్నలు:

- నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందా?
- ఎంపికైన అభ్యర్థులందరికీ నిర్దేశిత అర్హతలు ఉన్నాయా?
- అర్హతలు లేని వారికి ఉద్యోగాలు కల్పించారనే ప్రచారంలో వాస్తవం ఎంత?
- డెమో తరగతులు ఎంతమంది ఇచ్చారు? ఎంపిక ఎంతమందికి జరిగింది?
- ఎంపిక ప్రమాణాలు ఏమిటి?
- మధ్యవర్తుల పాత్ర ఏమైనా ఉందా?
- ఈ ఆరోపణలపై అంతర్గత లేదా బాహ్య విచారణ జరిగిందా?

ఈ అంశాలపై కళాశాల యాజమాన్యం, పాలక మండలి , సంబంధిత అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### ఫీజుల వ్యవహారంలోనూ ప్రశ్నలే..

అడ్మిషన్ ఫీజులు, పరీక్ష ఫీజులు, ఇతర వసూళ్లలో కూడా అవకతవకలు జరిగాయనే ఆరోపణలు విద్యార్థుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ అంశాలపై కూడా కళాశాల యాజమాన్యం మౌనం పాటించడం అనుమానాలను మరింత పెంచుతోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

### ప్రిన్సిపాల్ వైఖరిపై సందేహాలు

రిటైర్మెంట్‌కు చేరువలో ఉన్న ప్రిన్సిపాల్ ధర్మరెడ్డి తనకు తెలిసినా తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారా? లేక ఆరోపణలన్నీ నిరాధారమని భావిస్తున్నారా? అనే ప్రశ్నలు కళాశాల వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. "సమస్యలపై స్పందించకపోవడం వల్ల కళాశాల ప్రతిష్ట దెబ్బతింటోంది. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం ద్వారానే సంస్థ గౌరవాన్ని కాపాడవచ్చు" అని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి.

### మీడియాపై ఒత్తిళ్లు ఎందుకు?

కళాశాలలో జరుగుతున్న వ్యవహారాలను వెలుగులోకి తీసుకువస్తున్న మీడియా ప్రతినిధులను బెదిరించడం, ఒత్తిళ్లు తీసుకురావడం లేదా ఇతర మార్గాల్లో అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి. "ఆరోపణలు తప్పైతే ఆధారాలతో ఖండించాలి. కానీ ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకోవడం సరికాదు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న అంశాలను ప్రజల ముందుకు తీసుకువచ్చే మీడియాను అణచివేయాలనే ప్రయత్నాలు మంచివి కావు" అని వారు పేర్కొన్నారు.

### పారదర్శకతే పరిష్కారం

సీకేఎం కళాశాల గవర్నమెంట్ టేకోవర్ ప్రక్రియ, ఉద్యోగాల నియామకాలు, ఆర్థిక లావాదేవీలు, ఫీజుల వసూళ్లు సహా కళాశాలలో జరుగుతున్న అన్ని ప్రధాన కార్యకలాపాలపై పూర్తి వివరాలను తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలకు వెల్లడించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వినిపిస్తున్న ఆరోపణలపై కళాశాల యాజమాన్యం, ముఖ్యంగా ప్రిన్సిపాల్ ధర్మరరెడ్డి బహిరంగంగా స్పందించి తమ వైఖరిని స్పష్టం చేస్తేనే అనుమానాలకు తెరపడుతుందని విద్యార్థి సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. "ధర్మరెడ్డి" తన పేరుకు తగ్గట్టుగా ధర్మబద్ధంగా వ్యవహరించి నిజానిజాలను ప్రజల ముందుంచాలి" అని వారు కోరుతున్నారు.

# కాకతీయ యూనివర్సిటీలో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ తొలి సమావేశం

**ఆధునిక పీజీ కరికులమ్‌కు ఆమోదం**

**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ సమావేశం డీన్ ఆచార్య జి. హనుమంతు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య జితేందర్ నాయక్, విశ్వవిద్యాలయంలోని వివిధ సైన్స్ విభాగాల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. సమావేశంలో అన్ని నాన్-ప్రొఫెషనల్ పీజీ సైన్స్ కోర్సులకు సంబంధించిన సవరించిన పాఠ్య ప్రణాళికలు, సిలబస్‌లను ఏకగ్రీవంగా ఆమోదించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన, పరిశోధనా దృక్పథం, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో నూతన కరికులమ్‌ను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. కొత్త పాఠ్య ప్రణాళికలో వాల్యూ యాడెడ్, ఇంటర్‌డిసిప్లినరీ, స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్, వొకేషనల్, ఓపెన్ ఎలెక్టివ్ కోర్సులతో పాటు క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రీసెర్చ్ మెథడాలజీ, రీసెర్చ్ ప్రాజెక్ట్ వంటి ఆధునిక అంశాలను ప్రవేశపెట్టారు. దీంతో విద్యార్థులు ప్రస్తుత సాంకేతిక అవసరాలు, పరిశోధన రంగ అభివృద్ధులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా బ్లూమ్స్ టాక్సానమీ, అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ), సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీలు) ఆధారంగా పాఠ్యాంశాలను రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, పరిశోధనా సామర్థ్యాల అభివృద్ధికి ఈ మార్పులు దోహదపడతాయని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను తుది ఆమోదం కోసం స్టాండింగ్ కమిటీకి పంపనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో సైన్స్ విద్యను జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దే దిశగా ఈ సమావేశం కీలక మైలురాయిగా నిలిచిందని వారు పేర్కొన్నారు.

# వర్షాకాలంలో చెరువుల మత్తడి ప్రాంతాల్లో వలలు, జాలీలు ఏర్పాటు చేయొద్దు: జిల్లా మత్స్యశాఖ అధికారి పి. శ్రీపతి

**వరంగల్, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



వర్షాకాలం నేపథ్యంలో చెరువుల భద్రతపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పి. శ్రీపతి సూచించారు. ఈ మేరకు వరంగల్ జిల్లాలోని అన్ని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులకు పత్రికా ప్రకటన ద్వారా కీలక సూచనలు జారీ చేశారు. జిల్లాలోని 100 ఎకరాలకు పైబడిన, 100 ఎకరాలకు లోబడిన అన్ని చెరువులు మత్తడి పోతున్న సమయంలో మత్తడి ప్రాంతాల్లో ఎలాంటి సిమెంట్ దిమ్మెలు, ఇనుప జాలీలు, కర్రలు, వలలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ఇటువంటి అడ్డంకులు ఏర్పాటు చేయడం వల్ల చెరువు కట్టలు, కుంటల కట్టలు దెబ్బతినే ప్రమాదం ఉందని, భారీ వర్షాల సమయంలో కట్టలు తెగిపోయే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. చెరువుల రక్షణతో పాటు ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు మత్స్యకారులు, సహకార సంఘాల ప్రతినిధులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను ఉల్లంఘించి మత్తడి ప్రాంతాల్లో వలలు, జాలీలు లేదా ఇతర అడ్డంకులు ఏర్పాటు చేసిన సంఘాలు లేదా వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా మత్స్యశాఖ అధికారి హెచ్చరించారు. వర్షాకాలంలో చెరువుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ విషయాన్ని అన్ని మత్స్యకారులు అత్యవసరంగా పరిగణించాలని ఆయన సూచించారు.

# ఇతరులకు ఉపాధి కల్పించే సామర్థ్యం ఉన్న కోర్సు ప్రొఫెసర్ బి. చంద్రమౌళి

**ఆక్వాకల్చర్ రంగంలో అపార అవకాశాలు**
**పింగళి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఒక రోజు సదస్సు**





**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ఆక్వాకల్చర్ రంగంలో విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఈ కోర్సు ద్వారా యువత ఉద్యోగాలు పొందడమే కాకుండా ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగవచ్చని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అన్నారు. హనుమకొండలోని వడ్డేపల్లి పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పీజీ నాలుగో సెమిస్టర్ విద్యార్థుల కోసం "ఆక్వాకల్చర్‌పై ఒక రోజు సదస్సు" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సబ్జెక్ట్ మ్యాటర్ సైంటిస్ట్ డాక్టర్ జి. గణేష్ ఆక్వాకల్చర్ రంగంలోని అవకాశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. చేపల పెంపకం, ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులు, చేపల పరిశ్రమలో ఉన్న వ్యాపార అవకాశాలు, స్వయం ఉపాధి మార్గాలు, మార్కెటింగ్ విధానాలపై ఆయన సవివరంగా వివరించారు. ఈ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ రంగంలోని తాజా అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ ఆక్వాకల్చర్ కోర్సు ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు కూడా మెండుగా ఉన్నాయని అన్నారు. సరైన ప్రణాళికతో చేపల పెంపకాన్ని చేపడితే విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చని పేర్కొన్నారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి. సుహాసిని మాట్లాడుతూ ఆక్వాకల్చర్ కోర్సు ప్రాముఖ్యత, భవిష్యత్‌లో ఈ రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. అనంతరం డాక్టర్ జె. లఖన్ సింగ్ మాట్లాడుతూ ఫిషరీస్, ఆక్వాకల్చర్ రంగాల్లో ప్రస్తుతం విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఈ కోర్సు ద్వారా విద్యార్థులు త్వరితగతిన ఉపాధి పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధ్యాపకులు డాక్టర్ పి. సుభాషిణి, డాక్టర్ పి. కల్పన, బి. సంతోష్ కుమారి, సుమతి తదితరులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# దళితుడి భూమిపై కన్నేసి దాడులు..?

**పోగుల సమ్మయ్య కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సంఘాల డిమాండ్**
**దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వినతి**
**స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరిక**



**హన్మకొండ జిల్లా/కమలాపూర్, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన నిరుపేద దళిత రైతు పోగుల సమ్మయ్య భూమిని కబ్జా చేసేందుకు కొందరు రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, వారి ప్రోద్బలంతో దాడులకు పాల్పడిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం కమలాపూర్ మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం తహసీల్దార్ సురేష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు రామచంద్రరావు, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, ప్రముఖ న్యాయవాది మరియు అసైన్డ్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్ మాట్లాడుతూ పోగుల సమ్మయ్యకు కమలాపూర్ మండల కేంద్ర పరిధిలోని సర్వే నంబర్లు 990, 997లలో సుమారు రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. ఆ భూమి విలువ పెరగడంతో కొందరు రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ భూమిని తక్కువ ధరకు విక్రయించాలని బాధితుడిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. భూమిని విక్రయించేందుకు సమ్మయ్య అంగీకరించకపోవడంతో గూడూరు గ్రామానికి చెందిన కొందరు ముదిరాజ్ కులస్తులను ఉసిగొల్పి భౌతిక దాడులకు పాల్పడేలా చేశారని ఆరోపించారు. సుమారు 126 మంది వ్యక్తులు గుంపుగా వచ్చి భూమిలోకి అక్రమంగా ప్రవేశించి హద్దురాళ్లను తొలగించడంతో పాటు వ్యవసాయానికి సిద్ధం చేసిన నారు మడిని ధ్వంసం చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి, భూమిపై అక్రమ ఆధిపత్యం చెలాయించే ఉద్దేశంతో సిమెంట్ పిల్లర్లు నిర్మించేందుకు ప్రయత్నాలు చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనలపై బాధితుడు పోగుల సమ్మయ్య స్థానిక పోలీసు స్టేషన్, రెవెన్యూ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దళిత రైతు తన సొంత భూమిని కాపాడుకోవడానికి అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. దళితుల భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఇలాంటి ఘటనలు సామాజిక న్యాయానికి సవాలుగా మారుతున్నాయని అన్నారు. దళితుడిపై జరిగిన ఈ దాడిని కేవలం భూవివాదంగా కాకుండా సామాజిక వివక్ష, కుల ఆధారిత వేధింపుల కోణంలో కూడా విచారించాలని వారు కోరారు. బాధిత కుటుంబానికి భద్రత కల్పించడంతో పాటు భూమిపై పూర్తి హక్కులు రక్షించేలా రెవెన్యూ శాఖ తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఘటనలో పాల్గొన్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, రెవెన్యూ మరియు పోలీసు శాఖల ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. పోగుల సమ్మయ్యకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాట్లా రమేష్, స్థానిక ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నద్దునూరి ప్రసాద్, నాయకులు పుల్ల కొమురయ్య, పుల్ల రామస్వామి, పుల్ల శోభన్‌బాబు, పుల్ల శ్రీనివాస్, పుల్ల శ్రీకాంత్, పోగుల సమ్మయ్య, గుంపుల అశోక్, శనిగరపు ఉదయ్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు.

# గోర్రెకుంట యువకుడి మృతి సహజ మరణమే: పోలీసుల తుది నిర్ధారణ




**వరంగల్, 23 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

గోర్రెకుంట గ్రామానికి చెందిన ల్యాదెల్ల రాజు అలియాస్ లవ్ రాజు మృతి ఘటనపై గీసుగొండ పోలీసులు నిర్వహించిన సమగ్ర దర్యాప్తు పూర్తయింది. ఈ కేసులో హత్య లేదా ఇతర నేరపూరిత చర్యలు జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని, సడన్ కార్డియాక్ అరెస్ట్ కారణంగానే ఆయన మరణించినట్లు పోలీసులు తేల్చారు. గత ఏడాది అక్టోబర్ 19న చోటుచేసుకున్న ఈ ఘటనపై గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 337/2025 కింద అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సంఘటనా స్థల పరిశీలన, పంచనామా, పోస్టుమార్టం, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ నిపుణుల సేవలు, సీసీటీవీ ఫుటేజీల విశ్లేషణ, కాల్ డేటా రికార్డులు (సీడీఆర్), వాట్సాప్ చాట్స్ పరిశీలనతో పాటు అనుమానితులను విచారిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పరకాల డివిజన్ ఏసీపీ సి. హెచ్. సతీష్ బాబును ప్రత్యేక దర్యాప్తు అధికారి (ఎస్ఐఓ)గా నియమించి కేసును లోతుగా పరిశీలించారు. దర్యాప్తులో భాగంగా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నివేదికలు, హిస్టోపాథాలజీ పరీక్షలు, కాకతీయ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం వైద్య నిపుణుల అభిప్రాయాలను సేకరించారు. వైద్య నిపుణుల నివేదికల ప్రకారం మృతదేహంపై ఎటువంటి ప్రాణాంతక బాహ్య లేదా అంతర్గత గాయాలు లేవని, విష పదార్థాల ఆనవాళ్లు కూడా గుర్తించలేదని వెల్లడైంది. మృతదేహంపై కనిపించిన కొన్ని గుర్తులు మరణానంతర మార్పులు, చీమల కాట్లు మరియు తుమ్మ చెట్టు ముళ్ల వల్ల ఏర్పడినవేనని వైద్యులు స్పష్టం చేశారు. హిస్టోపాథాలజీ పరీక్షల ఆధారంగా ల్యాదెల్ల రాజు సడన్ కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణించినట్లు తుది వైద్యాభిప్రాయం వెల్లడైంది. మృతుడి కుటుంబ సభ్యులు వ్యక్తం చేసిన అనుమానాలను కూడా ప్రత్యేకంగా పరిశీలించిన పోలీసులు, సాక్షుల వాంగ్మూలాలు, శాస్త్రీయ నివేదికలు, వైద్య ఆధారాలు తదితరాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం ఈ ఘటనలో ఎటువంటి నేరపూరిత చర్యలు జరగలేదని నిర్ధారించారు. దీంతో ల్యాదెల్ల రాజు మృతిని సడన్ కార్డియాక్ అరెస్ట్ కారణంగా సంభవించిన సహజ మరణంగా పరిగణించి కేసును ముగించి రిఫర్ చేసినట్లు ప్రత్యేక దర్యాప్తు అధికారి, పరకాల ఏసీపీ సి. హెచ్. సతీష్ బాబు తెలిపారు.

# అంబేద్కర్ రాజు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిధులు అందజేత

**నలుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం**





**హనుమకొండ, జూన్ 23 (జై భీమ్ న్యూస్):**

హనుమకొండ లోని జ్యోతిబస్ నగర్‌లో నివసిస్తున్న నలుగురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన నిధులను వరంగల్ పశ్చిమ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు అంబేద్కర్ రాజు అందజేశారు. లబ్ధిదారులైన కీర్తి మంజుల యాకాంబరం (రెండో విడత బిల్లు), పాక మహేష్ (రెండో విడత బిల్లు), పేర్ల గౌరమ్మ (మొదటి విడత బిల్లు), ఆరూరి మౌనిక వెంకటేష్ (రెండో విడత బిల్లు) ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1 లక్ష చొప్పున ఈ సందర్భంగా అందించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన అంబేద్కర్ రాజు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. నిరుపేదల సొంత ఇంటి కలను నిజం చేయడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. నిధులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల చిన రాజు, కాలనీలోని పెద్దలు, మహిళలు, యువకులు , స్థానిక ప్రజలు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, అంబేద్కర్ రాజు నాలుగో డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలులో ముందుండి పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాల సొంత ఇంటి కల సాకారమవుతోందని, ఇలాంటి పథకాలు మరింత మందికి అందాలని స్థానికులు ఆకాంక్షించారు.





# వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

**ప్రభుత్వం జీవో విడుదల..చేతల ప్రభుత్వం అన్న లోకేశ్**

**అమరావతి,జూన్23(జై భీమ్ క్రైమ్ న్యూస్):**

వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా. నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వడ్డెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33 శాతం వాటాను వడ్డెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపైట్ల వడ్డెర సంఘాల నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పేదరికం విద్యకు ఆటంకం కారాదు: డాక్టర్ అనితా రెడ్డి

**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



పేదరికం ఎప్పుడూ విద్యకు ఆటంకం కాకూడదనే సంకల్పంతో పేద విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తున్నామని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. అనురాగ్ హెచ్ఆర్‌డి సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన హనుమకొండలోని శాయంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాటు వీధి బాలల ఆశ్రయం పిల్లలకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా దానం మహాదానమని, ప్రతి ఒక్కరూ తమకు చేతనైన మేరకు పేద పిల్లల విద్యకు సహకరించాలని పిలుపునిచ్చారు. గత 30 సంవత్సరాలుగా అనేక మంది పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించడమే కాకుండా వారి విద్యా ఫీజులను కూడా చెల్లిస్తూ సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. విద్య ద్వారానే వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్న ఆమె, విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. విద్యను కష్టంగా కాకుండా ఇష్టంగా అభ్యసించాలని, విద్య విజ్ఞానాన్ని అందించడమే కాకుండా ఆర్థికంగా కూడా ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని వివరించారు. పిల్లలు విద్యతో పాటు మంచి నడవడికను అలవర్చుకోవాలని, బడి వయస్సు గల ప్రతి చిన్నారి తప్పనిసరిగా విద్యను అభ్యసించాలని అన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధనకు సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉప్పలయ్య, బస్తీ బడి నిర్వాహకులు ఉపేందర్ రెడ్డి, కళ్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మీజిల్స్, రూబెల్లా, పోలియో అనుమానిత కేసుల సమాచారాన్ని వెంటనే అందించాలి

**ప్రైవేట్ వైద్యుల సహకారంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.డి. రామ్‌కుమార్**



**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

పిల్లల్లో జ్వరంతో పాటు దద్దుర్లు కనిపించినా, శరీరంలోని ఏ భాగమైనా అకస్మాత్తుగా బలహీనపడినట్లు గుర్తించినా వారి పూర్తి వివరాలను వెంటనే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి తెలియజేయాలని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి. రామ్‌కుమార్ సూచించారు. మీజిల్స్-రూబెల్లా సర్వైలెన్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న చిన్నారుల వైద్య నిపుణులు, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం పిల్లలకు సంపూర్ణ వ్యాధి నిరోధక టీకాలు అందిస్తున్నప్పటికీ అప్పుడప్పుడు మీజిల్స్, రూబెల్లా అనుమానిత లక్షణాలతో కూడిన కేసులు వెలుగుచూస్తున్నాయని తెలిపారు. జ్వరం, దద్దుర్లు ఉన్న పిల్లల వివరాలు అందిన వెంటనే నమూనాలు సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపిస్తామని చెప్పారు. పరీక్షల్లో పాజిటివ్‌గా తేలితే సంబంధిత ప్రాంతాల్లో వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే 15 సంవత్సరాల లోపు పిల్లల్లో శరీరంలోని ఏదైనా భాగం బలహీనపడినట్లు గుర్తించిన వెంటనే సమాచారం అందించాలని సూచించారు. పోలియో నిఘాలో భాగంగా అలాంటి కేసుల నుంచి కూడా నమూనాలు సేకరించి పరీక్షలకు పంపిస్తామని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాల అనంతరం పిల్లలకు ఏవైనా స్వల్ప ఆరోగ్య సమస్యలు తలెత్తినా వాటి సమాచారాన్ని కూడా అందించాలని కోరారు. ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రైవేట్ వైద్యులు కీలక పాత్ర పోషించాలని డీఎంహెచ్‌ఓ పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించేలా తల్లిదండ్రులను చైతన్యపరచాలని సూచించారు. వర్షాకాలంలో ర్యాపిడ్ కిట్ ద్వారా పాజిటివ్‌గా వచ్చిన ప్రతి కేసును డెంగ్యూగా పరిగణించరాదని, డెంగ్యూ నిర్ధారణకు ఎలీసా పరీక్ష ఫలితాలనే ప్రామాణికంగా తీసుకోవాలని వైద్యులకు సూచించారు. సమావేశంలో పరకాల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వంశీకృష్ణ, పిల్లల వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. రమేష్, కోశాధికారి డాక్టర్ అన్వేషిని, డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ రజిత, డాక్టర్ మురళి, జీఎంహెచ్ ఎస్ఎన్‌సీయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మానస నరహరి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రుబీనా, డెమో వి. అశోక్‌రెడ్డి, స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 29 ఏళ్ల తర్వాత ఆల్మా మేటర్‌లో అడుగుపెట్టిన అమెరికా ఎన్ఆర్ఐ దంపతులు

**కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం**

**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**






అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆకుల రాధాకృష్ణ, కట్ట తనూజ దంపతులు దాదాపు 29 ఏళ్ల అనంతరం కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ను సందర్శించి తమ విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానం చేశారు. తాము చదువుకున్న తరగతి గదులు, ప్రయోగశాలలను సందర్శించిన రాధాకృష్ణ, తనూజ దంపతులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, మార్గదర్శకత్వం అందించిన అధ్యాపకులను, సీనియర్లను స్మరించుకున్నారు. ప్రస్తుత ఫార్మసీ విద్యార్థులతో మమేకమై ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, విదేశాల్లో కెరీర్ అవకాశాలపై విలువైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆచార్యులు మండ సారంగపాణిని కుటుంబ సమేతంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. తమ పిల్లలకు తాము చదివిన కళాశాల, తరగతి గదులు, ప్రయోగశాలలను చూపిస్తూ సాధారణ పరిస్థితుల నుంచి ఎలా ఉన్నత స్థాయికి చేరుకున్నామో వివరించారు. సమాజానికి తిరిగి సేవ చేయాలనే "పే బ్యాక్ టు సొసైటీ" భావనతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అమెరికా సహా పాశ్చాత్య దేశాల్లో కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆకుల రాధాకృష్ణ తెలిపారు. ఈ కళాశాల నుంచి ఉత్తీర్ణులైన అనేక మంది అమెరికాలోని ప్రముఖ ఫార్మా సంస్థలు, యూఎస్ఎఫ్‌డీఏ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆచార్య గాదే సమ్మయ్య మాట్లాడుతూ ఆకుల రాధాకృష్ణ 1993--97 బ్యాచ్, కట్ట తనూజ 1995--99 బ్యాచ్ బి.ఫార్మసీ విద్యార్థులని తెలిపారు. అనంతరం వీరు అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించి ప్రస్తుతం నాలుగు ఫార్మసీ స్టోర్లను విజయవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆకుల రాధాకృష్ణ, కట్ట తనూజ దంపతులను విశ్రాంత ఆచార్యులు మండ సారంగపాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ జానపరెడ్డి కృష్ణవేణి, ఆచార్య గాదే సమ్మయ్య, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సుజాత, డాక్టర్ సూర్యనారాయణ, శశిధర్ తదితర అధ్యాపకులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. దంపతుల ప్రేరణాత్మక ప్రసంగం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు ఉన్నత లక్ష్యాల సాధనకు మార్గదర్శకంగా నిలిచిందని అధ్యాపకులు పేర్కొన్నారు.

# గురిజాల రైతు వేదికలో ఘనంగా సీడ్ మేళా ప్రారంభం





**ప్రభుత్వం సూచించిన వరి విత్తన రకాలకే బోనస్ రైతులకు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సూచన**

**నర్సంపేట, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని గురిజాల రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన సీడ్ మేళా కార్యక్రమాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంయుక్తంగా ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై అవగాహన కల్పించడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న, ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తనాలకు మాత్రమే బోనస్ అందజేయనున్నట్లు తెలిపారు. అందుకే ఆయా విత్తన రకాలనే అధీకృత డీలర్ల ద్వారా సీడ్ మేళాలో విక్రయానికి ఉంచినట్లు పేర్కొన్నారు. రైతులు వర్షపాత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మధ్యకాలిక, స్వల్పకాలిక వరి రకాలను సాగు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పప్పుధాన్యాలు, జొన్న, నువ్వులు, కూరగాయల వంటి ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. యూరియాను వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే వినియోగించాలని, రెండో దఫా నుంచి నానో యూరియాను తప్పనిసరిగా ఉపయోగించాలని కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని తెలిపారు. రైతులు అంతర పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంచుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ఒకేచోట వివిధ రకాల నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచినందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలై శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయ నిర్మల, డీహెచ్‌వో శ్రీనివాస్, ఏడీఏ శ్రీనివాస్, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, వ్యవసాయ అధికారి కృష్ణకుమార్, సర్పంచ్‌లు గురిజాల చంద్రరావు, చిన్న గురిజాల కమలాకర్, జీజీఆర్‌పల్లి బుస నర్సయ్య, గుంటూరుపల్లి రజిత, వ్యవసాయ విస్తరణాధికారులు అశోక్, సింధు, సంధ్య, త్రివేణి, అబిద్ హుస్సేన్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్‌తో నేల సారం పెంపు






**రైతులకు అవగాహన కల్పించిన కృషి విజ్ఞాన కేంద్రం**

**వరంగల్, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేల సారం తగ్గిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యం రోజురోజుకు పెరుగుతోందని పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), మామునూరు అధికారులు పేర్కొన్నారు. రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్ (ఎఫ్ఓఎం) వినియోగం ఎంతో ప్రయోజనకరమని వెల్లడించారు. ఈ నేపథ్యంలో కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు ఆధ్వర్యంలో రైతులకు ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్ తయారీ, వినియోగం, ప్రయోజనాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. అరుణజ్యోతి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, హెడ్, రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్ నేలలో సేంద్రియ కార్బన్ శాతాన్ని పెంచి నేల నిర్మాణాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. దీని వినియోగం ద్వారా నేలలో సూక్ష్మజీవుల కార్యకలాపాలు పెరిగి మొక్కలకు అవసరమైన పోషకాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని వివరించారు. భవిష్యత్తులో స్థిరమైన వ్యవసాయాన్ని కొనసాగించాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం తప్పనిసరి అని పేర్కొన్నారు. రైతులు రసాయన ఎరువులపై పూర్తిగా ఆధారపడకుండా సేంద్రియ పద్ధతులను అవలంబించాలని సూచించారు. అనంతరం సేద్య విభాగ శాస్త్రవేత్త డా. సిహెచ్. సౌమ్య మాట్లాడుతూ, సమతుల్య పోషక యాజమాన్యం ద్వారానే పంటల ఉత్పాదకత పెరుగుతుందని తెలిపారు. పచ్చిరొట్టె ఎరువులు, జీవ ఎరువులు, సేంద్రియ ఎరువులు మరియు ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్‌ను సమగ్రంగా వినియోగించడం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు పంటలు ఆరోగ్యంగా పెరుగుతాయని వివరించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి ప్రకృతి అనుకూల వ్యవసాయ విధానాల వైపు రైతులు అడుగులు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రవీణ్, ఆపరేషనల్ ఇంజనీర్, ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్ తయారీ విధానాన్ని రైతులకు ప్రాయోగికంగా వివరించారు. స్థానికంగా లభించే సేంద్రియ పదార్థాలను ఉపయోగించి తక్కువ వ్యయంతో ఎఫ్ఓఎం తయారు చేసుకోవచ్చని తెలిపారు. దీని వినియోగం వల్ల పంటల వేర్ల పెరుగుదల మెరుగుపడటంతో పాటు నేలలో తేమ నిల్వ ఉండే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. అలాగే రసాయన ఎరువుల ఖర్చు తగ్గి రైతులకు ఆర్థికంగా కూడా లాభం చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రగతిశీల రైతు గిరిజా రాజిరెడ్డి తన అనుభవాలను పంచుకున్నారు. తాను తన వ్యవసాయ క్షేత్రంలో ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్‌ను ఉపయోగించగా పంట ఎదుగుదల గణనీయంగా మెరుగుపడిందని తెలిపారు. మొక్కల ఆరోగ్యం బాగుండటంతో పాటు దిగుబడులు కూడా ఆశాజనకంగా పెరిగాయని పేర్కొన్నారు. ఇతర రైతులు కూడా ఈ విధానాన్ని అనుసరించి వ్యవసాయ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో రైతులు ఎఫ్ఓఎం తయారీ, వినియోగం, మోతాదులు, పంటల వారీగా ఉపయోగించే విధానాలపై తమ సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని చేరవేసి, పర్యావరణ హిత వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు తెలిపారు.

## 29 ఏళ్ల తర్వాత ఫార్మసీ కళాశాలను సందర్శించిన అమెరికా ఎన్ఆర్ఐ పూర్వ విద్యార్థులు

**విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన ఆకుల రాధాకృష్ణ - కట్ట తనుజ**

**కాకతీయ యూనివర్సిటీ, జూన్ 23(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ను అమెరికాలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు ఆకుల రాధాకృష్ణ, కట్ట తనుజ సందర్శించి తమ విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దాదాపు 29 సంవత్సరాల తర్వాత తమ ఆల్మా మేటర్‌ను సందర్శించిన ఈ దంపతులు కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, తాము విద్యనభ్యసించిన ప్రదేశాలను పరిశీలించి భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన గురువులను, మార్గనిర్దేశం చేసిన సీనియర్లను గుర్తు చేసుకుంటూ ప్రస్తుత విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థి దశలో పొందిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం తమ జీవితాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చిందని పేర్కొన్నారు. విశ్రాంత ఆచార్యులు మండ సారంగపాణిని వారి నివాసంలో కుటుంబ సమేతంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా వారి కుమార్తె అమూల్యతో పాటు మనవళ్లు అభయ్, ఆయాన్ కూడా పాల్గొన్నారు. ఆకుల రాధాకృష్ణ 1993--97 బ్యాచ్‌కు, కట్ట తనుజ 1995--99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు. అనంతరం వీరు అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించి, మాస్టర్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మాస్టర్స్ ఇన్ ఫార్మసీ, ఫార్మ్-డి వంటి కోర్సులను పూర్తి చేశారు. ప్రస్తుతం అమెరికాలో నాలుగు ఫార్మసీ స్టోర్లను విజయవంతంగా నిర్వహిస్తున్నారని ఆచార్య గాదే సమ్మయ్య విద్యార్థులకు వివరించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆకుల రాధాకృష్ణ మాట్లాడుతూ, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌కు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థుల్లో గణనీయమైన సంఖ్యలో అమెరికాలోని ఫార్మా పరిశ్రమల్లో, ముఖ్యంగా యూఎస్ ఎఫ్‌డీఏ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పనిచేస్తున్నారని తెలిపారు. అనేక మంది పూర్వ విద్యార్థులు అమెరికాలో స్వంత ఫార్మసీ స్టోర్లు, ఔషధ పరిశ్రమలను స్థాపించి విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదిగారని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, సమాజానికి తిరిగి సేవ చేయాలనే "పే బ్యాక్ టు సొసైటీ" భావనను అలవరచుకోవాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో తాము సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మరియు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆచార్య జానపరెడ్డి కృష్ణవేణి, ఆచార్య గాదే సమ్మయ్య, విశ్రాంత ఆచార్య మండ సారంగపాణి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సుజాత, డాక్టర్ సూర్యనారాయణ, శశిధర్ తదితర అధ్యాపకులు ఆకుల రాధాకృష్ణ, కట్ట తనుజ దంపతులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. వారి విజయగాథ, స్ఫూర్తిదాయక ప్రసంగం ఫార్మసీ విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని అధ్యాపకులు పేర్కొన్నారు.






# యువత మత్తును వదలి క్రీడలపై దృష్టి సారించాలి: డీసీపీ ధార కవిత

**డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం పోలీసుల ప్రత్యేక కార్యక్రమాలు**









**మడికొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత సూచించారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల నిర్మూలన మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టిజిఎన్ఎబి) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మత్తు పదార్థాల వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కడిపికొండ రాజీవ్ గృహకల్ప వద్ద క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణం ప్రిన్సిపాల్ జయశ్రీతో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ ధార కవిత మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆశయమైన డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాలు, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మార్గదర్శకత్వంలో డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతాయని పేర్కొన్నారు. డ్రగ్స్ విక్రయిస్తున్నా, కొనుగోలు చేస్తున్నా లేదా నిల్వ ఉంచుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలవుతున్న యువత తమ ప్రతిభను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ, విదేశాల్లో అత్యున్నత స్థానాలకు చేరుకున్న వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మడికొండ, కడిపికొండ, బట్టుపల్లి, తరాలపల్లి, కుమ్మరిగూడెం గ్రామాల నుంచి సుమారు 300 మంది ప్రజలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉదయం మడికొండలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు రైటింగ్, క్విజ్, ప్రసంగ పోటీలను నిర్వహించారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పోలీసులు పిలుపునిచ్చారు.

# అడ్వకేట్ వల్లాల నాగరాజు కార్యాలయంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఖాద్రి



**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకుడు, అడ్వకేట్ వల్లాల నాగరాజు హనుమకొండలోని నక్కలగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యాయవాది కార్యాలయాన్ని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ నాగరాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన న్యాయవాద వృత్తిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యాలయ ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా అడ్వకేట్ వల్లాల నాగరాజు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రిని ఘనంగా సన్మానించారు. విద్యార్థి ఉద్యమాల కాలంలో తనకు నాయకుడిగా అందించిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం, స్ఫూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన డా. ఖాద్రి, అడ్వకేట్ వల్లాల నాగరాజు న్యాయవాద వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజలకు న్యాయం అందించడంలో అంకితభావంతో పనిచేస్తూ, సమాజంలో విశిష్ట గుర్తింపు పొందిన న్యాయవాదిగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమ నాయకులు, న్యాయవాదులు, స్నేహితులు, అభిమానులు పాల్గొని అడ్వకేట్ వల్లాల నాగరాజుకు అభినందనలు తెలియజేశారు.

# గోపాల్‌పూర్ ఊరచెరువు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**నిర్ణీత గడువులోగా డీసిల్టేషన్, రీటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశం క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి**



**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

గోపాల్‌పూర్ ఊరచెరువులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం గోపాల్‌పూర్ ఊరచెరువును సందర్శించిన కలెక్టర్, అక్కడ కొనసాగుతున్న డీసిల్టేషన్ (పూడిక తొలగింపు) పనులు, రీటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ శాఖ, జీడబ్ల్యూఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల నాణ్యత, పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో చెరువుల అభివృద్ధి పనులకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించి డీసిల్టేషన్ మరియు రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులను ఈ వారంలోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చెరువుల పునరుద్ధరణ ద్వారా వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం మెరుగుపడుతుందని, రైతులు, స్థానిక ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిరంతర పర్యవేక్షణతో చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో జీడబ్ల్యూఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# హిందీ శిక్షక్ దైనందినిని ఆవిష్కరించిన డీఈఓ గిరిరాజ్ గౌడ్

**హిందీ ఉపాధ్యాయులకు ఉపయోగకరమైన మార్గదర్శి : డీఈఓ**





**హన్మకొండ, 23 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

హిందీ ఉపాధ్యాయుల బోధనా ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు హనుమకొండ హిందీ ఫోరం రూపొందించిన “హిందీ శిక్షక్ దైనందిని”ని జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ గిరిరాజ్ గౌడ్ మాట్లాడుతూ, హిందీ భాషా బోధనలో ఈ దైనందిని ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పాఠ్య ప్రణాళికలు, బోధనా అంశాలను క్రమబద్ధీకరించుకోవడానికి ఇది ఒక చక్కని మార్గదర్శిగా నిలుస్తుందని పేర్కొన్నారు. హిందీ భాషాభివృద్ధికి హనుమకొండ హిందీ ఫోరం, హిందీ ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను మెరుగుపరచడంలో ఇటువంటి దైనందినులు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. హిందీ శిక్షక్ దైనందిని రూపకల్పనలో కృషి చేసిన హిందీ ఫోరం సభ్యులు, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ డాక్టర్ మన్మోహన్, హిందీ ఫోరం హనుమకొండ అధ్యక్షుడు, జిల్లా రిసోర్స్ పర్సన్ ఎఫ్.ఎస్. అలీ, ప్రధాన కార్యదర్శి, హిందీ స్టేట్ రిసోర్స్ పర్సన్ గౌస్ పాషా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఖాజీపేట్ జాగీర్ ప్రధానోపాధ్యాయులు స్వామి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేష్ తదితర హిందీ భాషా పండితులు పాల్గొన్నారు. హిందీ భాషా బోధనలో నాణ్యత పెంపొందించేందుకు రూపొందించిన ఈ దైనందిని ఉపాధ్యాయులకు నిత్య బోధనా కార్యక్రమాల్లో ఎంతో దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# బెంగళూరులో దారుణం ప్రియుడితో కలిసి తండ్రి, తల్లి, సోదరిని హత్య చేసిన కుమార్తె

**బెంగళూరులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి హత్య : హత్యకు కారణం ?**





**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

తండ్రి, తల్లి, సోదరినీ  తన ప్రియుడి కలిసి హత్య చేసిన కేసు కొత్త మలుపు తీసుకుంది.  నిందితురాలు శ్వేత సుమారు రూ. 30 లక్షల అప్పు తీసుకుంది. ఆ అప్పు తీర్చడానికి డబ్బు గానీ, ఆస్తిలో వాటా గానీ ఇవ్వడానికి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో ఈ హత్య జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. సోమసుందర్ (55), ముత్తులక్ష్మి (48), సుప్రియ (20) హత్యకు గురయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన శ్వేత, ఆమె ప్రియుడు కెన్నత్ పరారీలో ఉన్నారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, శ్వేత, కెన్నత్ సహజీవనం చేస్తున్న సమయంలో రూ. 30 లక్షల అప్పు తీసుకున్నారు. ఈ అప్పు తీర్చడానికి డబ్బు ఇవ్వమని శ్వేత తన తల్లిదండ్రులను కోరింది. కానీ తల్లిదండ్రులు డబ్బు ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో, కుటుంబ ఆస్తిలో వాటా ఇవ్వాలని శ్వేత పట్టుబట్టింది. ఈ విషయంపై కుటుంబంలో చాలా వాగ్వాదాలు జరిగాయి. అదే సమయంలో, శ్వేత మరియు కెన్నాత్ కత్తితో తండ్రి, తల్లి మరియు సోదరిపై దాడి చేశారని అనుమానిస్తున్నారు. ఇంతకుముందు వచ్చిన సమాచారం ప్రకారం, శ్వేత కెన్నాత్‌తో సహజీవనం చేస్తోంది. దీనిని ఆమె తల్లిదండ్రులు వ్యతిరేకించారు. అతను తన కుమార్తెకు నచ్చజెప్పడానికి వచ్చినప్పుడు ఈ సంఘటన జరిగింది. గాయపడిన సోమసుందర్ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో మరణించాడు. అతను మరణించడానికి ముందు అతని కుమార్తె మరియు ఆమె ప్రియుడు అతనిపై దాడి చేశారని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితులు శ్వేత మరియు కెన్నాత్‌ల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, విస్తృత గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు అని బెంగళూరు పోలీస్ కమిషనర్  తెలియజేశారు.

# 11వేల మంది ఉద్యోగులకు లబ్ది

**సీపీఎస్ అసోసియేషన్ హర్షం**

**అమరావతి,జూన్23(జై భీమ్ క్రైమ్ న్యూస్):**

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఏపీ సచివాలయ సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ స్వాగతించింది. జ.వోనెం.57 అమలుపై సీపీఎస్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. కేబినెట్ నిర్ణయంతో రాష్ట్రంలోని 11 వేల మంది ఉద్యోగులకు లబ్ది చేకూరనుంది. వెటరన్, ఫ్యామిలీ అఖా కంట్రిబ్యూషన్‌పై స్పష్టతనిచ్చిన సర్కార్.. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం చూపించింది. ఉద్యోగుల గ్రాడ్యుటీ మేరకు ఫ్యామిలీ పెన్షన్ మంజూరుకు నిర్ణయం తీసుకుంది. దీంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు అఖా అసోసియేషన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అఖా అసోసియేషన్ పేర్కొంది. ఏపీ కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి మెమో 57 ప్రకారం 11 వేలమంది ఉద్యోగులకు మేలు జరిగిందన్నారు. ప్రభుత్వరంగ ఉద్యోగుల పదవి విరమణ వయసును 60 నుంచి 62కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కేబినెట్ నిర్ణయంతో ఈరోజు ఉద్యోగుల కల నెరవేరిందన్నారు. అందుకే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఉద్యోగులు ధన్యవాదాలు తెలియజేస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ అంశాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించాలని విద్యాసాగర్ కోరారు.

# వైకాపా కుల,కుట్ర రాజకీయాలు తిప్ప కొట్టాలి

**ప్రతి అంశంపైనా అవగాహన పెంచుకోవాలి**
**మంత్రులకు చంద్రబాబు సూచన**

**అమరావతి,జూన్23(జై భీమ్ క్రైమ్ న్యూస్):**

కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిమినల్స్‌ను వైసీపీ వెనకేసుకొస్తూ రాజకీయం చేస్తోందన్నారు. వైసీపీ నేతలు కుల మీటింగ్‌లు పెడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రల్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కర్నూలులో ఇటీవల చోటుచేసుకున్న ఘటనను ప్రస్తావించిన సీఎం, గ్రామస్థులే బహిష్కరించిన వ్యక్తులకు వైసీపీ మద్దతుగా నిలవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అనవసర వివాదాల్లోకి లాగేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి సందర్భాల్లో కూటమి ఐక్యతను చాటే విధంగా మంత్రులంతా స్పందించాలని సూచించారు. ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా సీఎం కీలక ప్రకటనలు చేశారు. జొన్నగిరి గ్రామాన్ని 'స్వర్ణ గ్రామం'గా నామకరణం చేయాలని ప్రతిపాదించారు. అలాగే జూలై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. కులాల మధ్య చిచ్చుపెట్టే ఆ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని మంత్రులకు ఆయన సూచించారు. మంత్రులు అన్ని శాఖలపైనా అవగాహన పెంచుకోవాలి. తన శాఖ పరిధి కాదని కూర్చోకుండా ప్రతి అంశంపై స్పందించాలి. డీఎస్సీ, వివిధ అంశాలపై వైకాపా చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ వ్యవహారంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని అతడి కుటుంబసభ్యులు నమ్మారని మంత్రులు అన్నారు. ఈ అంశంలో వైకాపా రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

# మా ఇంటి బంగారాన్ని అభినందించిన మెగాస్టార్

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత మంచి స్పందనను అందుకుంటోంది. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం అనంతరం సమంత నటించిన తొలి సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, చిత్ర యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన, సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా చూసిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, మా ఇంటి బంగారం చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగాలను అందంగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు అని పేర్కొన్నారు. అలాగే సమంత నటనను ప్రత్యేకంగా ప్రశంసించిన ఆయన, సమంత నటన అద్భుతంగా ఉంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇటువంటి మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరం. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ మరియు మొత్తం చిత్ర బృందానికి హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. మరోవైపు జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి సతీమణి సురేఖ సమంత దంపతులకు కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించారు. ఈ కామెంట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. ముఖ్యంగా 'కొత్త అధ్యాయం' అనే పదం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీనిపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సమంత ప్రగ్నెన్సీ విషయంలో చిరు ఈ కామెంట్ చేశారా అని పలువురు ముచ్చటించుకుంటున్నారు. ఇక జూన్ 19న విడుదలైన 'మా ఇంటి బంగారం' మొదటి రోజునుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ముఖ్యంగా సమంత నటన, భావోద్వేగ సన్నివేశాలు, కుటుంబ నేపథ్యం, యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

# పెద్ది తరవాత బుచ్చిబాబులో మార్పు

**కొత్త సినిమా కోసం వేగం పెంచాలని నిర్ణయం**

టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సాన గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకొచ్చేది ఆయన కథలపై చూపించే నిబద్ధత. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించే దర్శకుల కంటే, కథను పూర్తిగా సిద్ధం చేసి, ప్రతి అంశాన్ని పక్కాగా మలిచిన తర్వాతే సెట్స్‌పైకి తీసుకెళ్లే దర్శకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇప్పుడు బుచ్చిబాబు తన పని విధానంలో కీలకమైన మార్పుకు సిద్ధమవుతున్నారనే చర్చ ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా అద్భుతమైన అరంగేట్రం చేసిన బుచ్చిబాబు తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నారు. అయితే ఆ సినిమా తర్వాత వెంటనే కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించకుండా, తన రెండో చిత్రానికి అవసరమైన కథ, పాత్రలు, ప్రీ-ప్రొడక్షన్ పనులపై చాలా సమయం కేటాయించారు. దీంతో 'ఉప్పెన' తర్వాత ఆయన తదుపరి చిత్రం కోసం అభిమానులు, సినీ పరిశ్రమ దాదాపు కొన్ని సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. చివరకు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. 'పెద్ది' విజయం బుచ్చిబాబు కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలతో కూడిన కథనం, పాత్రల రూపకల్పన, విజువల్ ట్రీట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయన కథ చెప్పే తీరు, భావోద్వేగాలను తెరపై ఆవిష్కరించే విధానానికి విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. గతంతో పోలిస్తే చాలా తక్కువ సమయంలోనే తన తదుపరి సినిమాను ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ తీవ్రంగా పెరిగింది. ఒక దర్శకుడు వరుస విజయాలను కొనసాగించాలంటే తక్కువ వ్యవధిలోనే కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించడం కూడా కీలకంగా మారింది. ఈ విషయాన్ని బుచ్చిబాబు కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే ఈసారి కథా రచన, ప్రీ-ప్రొడక్షన్ ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి తదుపరి సినిమాను త్వరగా పట్టాలెక్కించాలని ఆయన భావిస్తున్నారని సమాచారం.

# వారసత్వం ఉన్నా...కష్టపడితేనే ఫలితం

**ప్రేక్షకులు ఊరికే ఆదరిస్తానుకోరాదు**

**నటుడు రామ్ చరణ్**

సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ నటుడి నటను చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు. నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి అని చెప్పారు. ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం' అని రామ్ చరణ్ తెలిపారు.

# కేయూలో వెంకట్రామ్ రెడ్డి విద్యా రాజకీయాలు

**అనధికార హోదాలో కూర్చుండి కేయూ శాసిస్తున్నాడు**

**వీసీ రిజిస్ట్రార్లను మభ్యపెడుతూ విద్యార్థులను బెదిరిస్తున్నాడు**

**విద్యార్థుల ఉసురు పోసుకుంటున్నాడు**

**అవినీతి అక్రమార్కుల కొమ్ముకాస్తున్నాడు**

**అవినీతిపరులకు అండగా నిలుస్తూ రక్షిస్తున్నాడు**

**అధికార పదవులను వ్యక్తిగత స్వార్థానికి వాడుకుంటున్నాడు**

**విద్యార్థుల పైకి రిజిస్ట్రార్ను ఉసిగొల్పుతున్నాడు**



**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్ :**

విద్యా నిలయానికి కేంద్ర బిందువుగా మారాల్సిన కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యా రాజకీయాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని విద్యార్థులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. యూనివర్సిటీ చట్టాల్లో ఎక్కడ నామరూపం లేని ఓఎస్డి పదవిని భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన వెంకట్రామ్ రెడ్డి బలవంతంగా చరపట్టుకొని సక్రమంగా నడుస్తున్న కేయూ పరిపాలనను అస్తవ్యస్తం చేస్తున్నాడని విద్యార్థులు క్షేత్రస్థాయిలో విమర్శిస్తున్నారు. కేవలం అధికార పదవిని కాపాడుకోవడం కోసం ఎన్ని ఎత్తుగడలు ఎన్ని పైరవీలు చేస్తున్నాడు అదే క్రమంలో విద్యార్థులపై ఎన్ని మానసిక ఒత్తిళ్లు చేస్తున్నాడో విశ్వవిద్యాలయ సమాజం పసిగట్టడం వెంకట్రామ్ రెడ్డి గుర్తించకపోవడం గమనార్హం అంటున్నారు. కేయూలో పలు కీలకమైన పదవులలో కొనసాగుతున్నప్పటికీ అకుట్ అధ్యక్షునిగా కేయూ కీలక పదవులలో గాని ఏ విధమైన అధికార పదవులలో కొనసాగడానికి వీలులేదని తెలిసినప్పటికిని ఓఎస్డి పోస్టుపై తీవ్రమైన ధర్నాలు, నిరసనలు వ్యతిరేక ఉద్యమాలు జరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారులను ప్రలోభాలకు గురిచేస్తూ వాళ్ల పరువుతోపాటు అధికార పదవుల గొప్పతనాన్ని తీవ్రంగా దిగజారుస్తూ వ్యక్తిగత రూమును కేటాయించుకోవడం వాహనాన్ని కేటాయించుకోవడం రెప్పపాటులో జరుగుతుండగా ఒక వైపు ఓఎస్డి పోస్టును రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తుండగా కేయూ విద్యా చట్టాలలో ప్రభుత్వ చట్టాలలో యూజీసీ చట్టాలలో ఎక్కడా లేని ఓఎస్డి పోస్టులో దర్జాగా కొనసాగుతూ యూనివర్సిటీకి సంబంధించిన కాన్ఫిడెన్షియల్ రికార్డులపై కాన్ఫిడెన్షియల్ నిర్ణయాలపై సంతకాలు చేస్తూ యూనివర్సిటీ నియమాలకు విరుద్ధమైన కార్యక్రమాలు చేస్తున్నాడని వివిధ పత్రికలు పెద్ద ఎత్తున వార్తలు రాస్తున్నప్పటికీ అధికారులకు ప్రభుత్వానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి ఏమాత్రం పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తుండడం విడ్డూరంగా ఉందని విద్యార్థులు అంటున్నారు. చివరకు కేయూ ఉపకులపతి దిష్టిబొమ్మ తగలబెట్టేవరకు ఓఎస్డి పోస్టు రాజకీయాలు ప్రబలిపోవడం వికారంగా ఉందని విద్యార్థులు హెచ్చరిస్తున్నారు. విశ్వవిద్యాలయానికి ప్రభుత్వానికి విద్యా పరమైన పేరు ప్రతిష్టలు తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్న వీసీ రిజిస్ట్రార్లకు చట్టంలో లేని పోస్టును సృష్టించి ప్రభుత్వానికి తెలియకుండా ఈసీ నిర్ణయాలతో సంబంధం లేకుండా ఓఎస్డీ పోస్టులో వెంకట్రామ్ రెడ్డిని దర్జాగా కొనసాగిస్తూ విశ్వవిద్యాలయ విలువలను దిగజార్చడం వెనకాల కేవలం ఓఎస్టీ వ్యక్తిగతమైన స్వభావంలోని స్వార్థం దాగి ఉందని అది కాస్త విద్యార్థులను జర్నలిస్టులను యూనివర్సిటీ సమాజాన్ని తీవ్రమైన మనస్థాపానికి గురిచేస్తుండటమే కాకుండా ఓఎస్డి పోస్ట్ విషయంలో ఎక్కడలేని రాజకీయం జరుగుతున్నాయని అదే క్రమంలో కేవలం ఆ పోస్టు సృష్టించబడింది అవినీతిపరులను అక్రమార్కులను అసాంఘిక శక్తులను విశ్వవిద్యాలయ సంఘవిద్రోహశక్తులను కాపాడడం కోసమేనని స్పష్టంగా అర్థమవుతుండగా వెంకట్రామ్ రెడ్డి స్వయంగా వాటిని బలపరుస్తూ అలాంటి వ్యక్తులకు క్షేత్రస్థాయిలో సహకరిస్తూ వీసీ రిజిస్ట్రార్లను శాసించాలనే ప్రయత్నం చేస్తూనే వాళ్లకి ఏమాత్రం విలువ లేకుండా చేస్తూ తన వ్యక్తిగత స్వార్థాన్ని తన వ్యక్తిగత అభిప్రాయాన్ని తన సన్నిహిత వర్గమైన అవినీతి అక్రమార్కుల కోసం పెద్ద ఎత్తున పనిచేయడం కోసం కేవలం పదవి స్వార్థంతో విశ్వవిద్యాలయం నాశనాన్ని కోరుకుంటున్నాడని విద్యార్థి సంఘలే కాకుండా యూనివర్సిటీలో అన్ని వర్గాలు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నాయి. గతంలో రిజిస్ట్రార్ గా కొనసాగి కాకతీయ విశ్వవిద్యాలయాన్ని కావలసినంత నష్టంలోనికి కావలసినంత నాశనానికి నెట్టివేసి పదవి వ్యామోహాన్ని బలపరుచుకున్నట్లుగా రిజిస్టార్ హాయంలో చేసిన అక్రమాలన్ని వెలుగులోనికి వస్తున్నప్పటికీ కేయూ ఉన్నతాధికారులు మాత్రం వాటిని పట్టించుకోకుండా విద్యార్థుల మనోభావాలతో సంబంధం లేకుండా విశ్వవిద్యాలయం మనోభావాలతో సంబంధం లేకుండా కేవలం అధికార పదవనేది అడ్డగోలుగా రాజకీయాలు చేయడానికి వ్యక్తిగతంగా సంపాదించుకోవడానికి విశ్వవిద్యాలయంలోని అన్ని రకాల ఫలాలను అనుభవించడానికి వెంకట్రామ్ రెడ్డిని కొనసాగిస్తున్నట్లుగా ఉందని విద్యార్థులు మండిపడుతున్నారు. మాటిమాటికి పక్క విశ్వవిద్యాలయాలను ఉదాహరణగా చూపెడుతూ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఓఎస్డి పోస్టును పెట్టుకుంటే తప్పేంటి అంటూ ప్రశ్నిస్తున్న వాళ్లను దబాయిస్తున్న కేయూ ఉన్నతాధికారులు 50 సంవత్సరాలుగా కాకతీయ విశ్వవిద్యాలయంలో ఓఎస్డి పోస్టు లేకుండా విశ్వవిద్యాలయం ఎలా అభివృద్ధి చెందిందో ఎందుకు పసిగట్ట లేకపోతున్నారని హెచ్చరిస్తున్నారు. కేయూలో పరిష్కరించబడాల్సిన చిన్న చిన్న విషయాలను భూతద్దంలో పెట్టి పెద్దవిగా చూపిస్తూ ప్రభుత్వాలకు రాస్తూ వేధింపులకు గురి చేస్తున్న కేయూ ఉన్నత అధికారులకు ఓఎస్డి పోస్ట్ విషయంలో వాళ్ళు చేసిన తప్పును ఎందుకు కప్పిపుచ్చుకుంటున్నారు అంటూ విద్యార్థులు హెచ్చరిస్తున్నారు. అదే సందర్భంలో కేయూలో జరుగుతున్న అవినీతి అక్రమాలు వాటిని కాపాడడం కోసం నియమించబడిన అనధికార ఓఎస్డి పోస్టు మిగతా విశ్వవిద్యాలయాలలో అదే విధమైనటువంటి అవినీతి అక్రమాలను పెంచి పోషించే విధంగా ఎందుకు కొనసాగించబడడం లేదంటూ కేయూ అధికారులు పసిగట్టకపోవడం ఓఎస్డి పోస్టు రూపంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో క్షేత్రస్థాయి అవినీతిని క్షేత్రస్థాయి అక్రమాలను క్షేత్రస్థాయి అణిచివేతను క్షేత్రస్థాయి రాజకీయాలను పెంచి పోషించడం కోసమేనన్నట్లు విద్యార్థులు హెచ్చరిస్తున్నారు. అకాడమిక్ పరమైన విషయాలను పరిశీలించడం కోసం ఓఎస్డి పోస్టు కొనసాగుతుందని కొత్తగా ప్రచారం చేస్తున్న కేయూ అధికారులు ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని కేయూలో అకాడమిక్ పరంగా డీన్స్ బీవోఎస్ హెచ్వోడీస్ సంబంధిత అధికారులతో పాటుఅద్భుతమైన అకాడమిక్ ఏర్ మరో కీలక అద్భుతమైన అడ్మినిస్ట్రేటివ్ డిఆర్ లతోపాటు ప్రతి విభాగానికి చెందిన ఆచార్యులు వాళ్ళ వాళ్ళ విధులను సక్రమంగా నిర్వహించుకుంటూ ఉండగా మధ్యలో తలదూరుస్తున్న ఓఎస్డి వాటికి కొరివిలు పెడుతూ విభాగాలలో అధ్యాపకులు ఆచార్యుల మధ్య గొడవలను పెట్టిస్తూ ప్రతి విభాగంలో తన్నుకులాడే విధంగా చేస్తున్న ఓఎస్డి పోస్టు ఎంత దిక్కుమాలినోదో అధికారులు పసిగట్టకపోవడం సిగ్గుచేటు అంటూ విద్యార్థి సంఘాల నేతలు తప్పుపడుతున్నారు. తక్షణమే ఓఎస్డీ పోస్టును రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామంటూ విద్యార్థి సంఘాలు కేయూ ఉన్నతాధికారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అంతేకాకుండా కేయూలో ఉద్యోగంలో చేరినది మొదలుకొని నేటి వరకు వెంకట్రామ్ రెడ్డి నిర్వహించిన విధుల పట్ల జరిగిన అవకతవకల పట్ల అక్రమ ఆర్డర్లు అవినీతి సంపాదన అక్రమార్కులను అవినీతిపరులను అసాంఘిక శక్తులను భూకబ్జాదారులను పెంచి పోషిస్తున్న విధానాల పట్ల సిట్ విచారణకు ఆదేశిస్తూ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు వాళ్ళ నిజాయితీని నిరూపించుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ

ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు 'ప్రభాస్ నామ సంవత్సరం'గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 'స్పిరిట్', 'ఫౌజీ', 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' చిత్రాలు ఒకే ఏడాదిలో విడుదలైతే భారతీయ సినీ పరిశ్రమలోనే అరుదైన రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ఈ ప్రాజెక్ట్‌ల అధికారిక విడుదల తేదీలపైనే ఉంది.

